శ్రీ మహాగణాధిపతయే నమః　　శ్రీ గురుభ్యోనమః　　శ్రీ మహాసరస్వత్యై నమః






శ్రీ ప్రణవపీఠ వ్యవస్థాపకులు, అభినవశుక,
త్రిభాషామహాసహస్రావధాని, ప్రవచననిధి
**బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గురుదేవులు**
అందించిన అష్టాదశపురాణముల ప్రవచనాంతర్గతంగా



ఓం పూజ్యగురువులు బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ గారి ప్రవచనములలో ఉన్నవాటిని భక్తులకు అనుకూలంగా ఉండడానికి పితృకార్యాలు - ధర్మసందేహాలు - ధర్మసూక్ష్మములు అనే ఒక చిన్న శీర్షిక ద్వారా ప్రణవపీఠము అందిస్తున్నది. వీటిలో కొన్ని విషయాలు కల్పభేదం, జనాచారం, ప్రాంతీయ భేదం వల్ల మార్పులు ఉండవచ్చు.

# పితృకార్యాలు - ధర్మ సందేహాలు - ధర్మ సూక్ష్మములు

**1. శ్రాద్ధం నాడు ఎందుకు ఇంటిముందు ముగ్గు వేయరాదు? ఒకవేళ తోరణాలు ఉంటే తీసేయాలా? శ్రాద్ధం నాడు దేవతా పూజ చేయకూడదా? శాస్త్రం ఏమి చెప్పింది?**

◆ పితృకార్యాలు జరిగే ఇంటిలో భోక్తలు, పురోహితుడు తప్ప అతిథి, భిక్ష చేసేవారు, ఇతర సన్నిహితులు ఇంటికి వస్తే పితృకార్యానికి ఇబ్బంది ఏర్పడవచ్చు. అందుకే పితృకార్యం ఆ ఇంటిలో ఆ రోజు ఉందని తెలియటానికి ఇంటి ముందు ముగ్గు వేయకూడదు, ఒక వేళ తోరణాలు ఉంటే తీసేయాలి అంటారు. దేవతల పుత్రులలో కొందరు దేవతల కంటే అధిక జ్ఞానము పొంది దేవతల చేత పూజింపబడ్డారు. వారిని పితృదేవతలు అంటారు. పితృకార్యాలు చేసేటప్పుడు తప్పక ఆ ఇంటిలో దేవతాపూజ చేసిన తరువాతనే పితృపూజ చేయాలని గరుడ పురాణం, మార్కండేయ పురాణం మొదలైనవి చెపుతున్నాయి. అందుకు ప్రమాణంగా రుచి అనే ప్రజాపతి అందించిన పితృస్తవం (పితృస్తోత్రం) లో 26 వ శ్లోకం –

"యే దేవపూర్వాణ్యతి తృప్తిహేతోః అశ్నంతి కవ్యాని శుభాహుతాని" |

ఆ శ్లోకము ప్రకారం దేవతా పూజ చేసిన తర్వాత పితృకార్యాలు చేసేవారిని పితృదేవతలు సంపూర్ణంగా అనుగ్రహిస్తారని అర్థం వస్తుంది. శ్రాద్ధం పెట్టే యజమాని ఇంటిలో పూజకు ఎక్కువ సమయం కేటాయిస్తే ముఖ్యమైన శ్రాద్ధ కార్యముకు ఇబ్బంది కలిగే అవకాశం ఉంది. అందుకే సంధ్యావందనం, జపం చిన్నగా (కొద్ది సమయంలో) చేసి ముగించాలి.

**2. శ్రాద్ధ దినమునున శ్రాద్ధ కార్యం ముగించకుండా దానం, స్వయంపాకం, భిక్ష ఇవ్వడం, దేవతలకు మహా నైవేద్యం పెట్టడం, గోవుకు గ్రాసం ఇవ్వడం వంటివి చేయరాదా? ఎందుకు?**

◆ పితృదేవతలు ఏ రూపంలో అయినా వచ్చి కర్త దగ్గర దానం, భిక్ష లేదా స్వయంపాకం తీసుకుని తృప్తి పడి వెళ్ళిపోవచ్చు. అప్పుడు శ్రాద్ధ కార్యం నిష్ఫలం అవుతుంది. అందుకే వాటిని శ్రాద్ధం పెట్టే యజమాని చేయకూడదు. ఇతరుల చేత పైవన్నీ చేయించవచ్చు. శ్రాద్ధం పూర్తి అయ్యాక యజమాని పైవన్నీ చేయచ్చు.

**3. దేవతలు కూడా పితృదేవతలని పూజిస్తారు. అందుకే పితృకార్యాలు నిర్లక్ష్యం చేయకుండా శ్రద్ధగా చేసే వారి కుటుంబాలు సుఖ సంతోషాలతో ఉంటారని శాస్త్రం. మాములుగా చనిపోయిన తిథినాడు, సంక్రమణ కాలం, అమావాస్య మరియు ఏదైనా క్షేత్రాలలో లేదా ఇంటిలో పిండ ప్రదానము నిర్వహించడం మన ఆచారం. చనిపోయిన వారి తిథి తెలియక పోయినా లేదా మనకు ఇష్టమైన వారికి నరక విముక్తి పొంది ఉత్తమలోకాలు పొందాలన్నా ఏ తిథి అత్యంత ముఖ్యము? ఏ రోజు వీరి అందరిని తలచుకొని యథాశక్తి పిండప్రదానం లేదా దక్షిణతో కూడిన స్వయంపాకం ఇస్తారు?**

◆ భాద్రపద అమావాస్య (మహాలయ అమావాస్య).

4. ముఖ్యముగా ఏ కూరగాయలు మరియు పదార్థాలు శ్రాద్ధ భోజనానికి, స్వయంపాకమునకు (కూరగాయలు, వంట సామగ్రి మొ||) నిషిద్ధము?

◆ దోసకాయ, ఆనపకాయ, అలసంద, ఉల్లి, వెల్లుల్లి, క్యారట్, ఆలూ, వంకాయ, పెండలం, టమోట, కొర్రలు, వెలగ, అవిసె, ఇంగువ వంటి సుగంధ ద్రవ్యాలు, కందిపప్పు, కొత్తరకం కూరగాయలు (క్యాబేజీ, కాలిఫ్లవర్, క్యాప్సికమ్ మొ|| )

5. శ్రాద్ధ భోజనానికి వేటితో వండితే పితృదేవతలు మరింత సంతోషిస్తారు ? స్వయంపాకమునకు (కూరగాయలు, వంట సామగ్రి మొ||) ఏవేవి దానం చేస్తే మంచిది?

◆ పితృదేవతలకి ఆవపిండితో చేసిన వంటలు, నువ్వులుతో వంటలు, గోధుమలతో చేసిన అప్పాలు, పెసర, మినపపప్పుతో వంటలు వండడం లేదా ఇవి దానాలు చేయడం వల్ల పితృదేవతలు తృప్తి పడతారు. స్వయంపాకమునకు కందగడ్డ, చామగడ్డ, తోటకూర, బెల్లం, చింతపండు, బెండ, కాకర, పనసకూర, ఎండుమిరప, ఆవాలు, ఆవు నెయ్యి, పంచకదళి (అరటికాయ, అరటిపండు, అరటిపువ్వు, అరటి దూట, అరటి ఆకు), పాలు, పెరుగు, నల్ల మినపపప్పు, పెసరపప్పు, అల్లం, చెరకు రసం మొదలైనవి

6. సూర్యోదయానికి ముందే ప్రతి ఇంటి గడప ముందు రంగవల్లులు (ముగ్గులు) ఉంటే ఆ ఇంటికి లక్ష్మీ అనుగ్రహం ఉంటుందని మరియు ముగ్గు వేయడం ద్వారా దేవతలని ఇంటికి ఆహ్వానించినట్లు అని పెద్దల మాట. మరి కొన్ని ప్రత్యేక దినములలో ఇంటి ముందు ముగ్గు వేయకూడదు అంటారు. ఎప్పుడు?

◆ పితృదేవతలను ఆహ్వానించే రోజు అనగా శ్రాద్ధ కర్మలు నిర్వహించే రోజు మాత్రం ఇంటి ముందు ముగ్గు వేయరాదు.

7. పితృదేవతలకు తర్పణాలు ఇచ్చేటప్పుడు నువ్వులు నీళ్ళు ఎలా ఇవ్వాలి? ఎన్ని నువ్వులు ఉండాలి?

◆ కొన్ని నువ్వులు తీసుకుని వాటితోనే అన్ని తర్పణములు చేయరాదు. ప్రతి తర్పణముకు నువ్వులు తీసుకోవాలి. కనీసం 7 లేదా అంతకు మించి ఎక్కువ నువ్వులు అయినా ఉండాలి.

8. ఏ రెండు వంటకాలు పితృకార్యాల సమయంలో తప్ప మిగిలిన రోజులలో చేయరాదు?

◆ గారెలు, పరమాన్నం ఒకే రోజు చేయరాదు. అవి రెండూ కలిపి తింటే మాంసంతో సమానం. అందుకే కేవలం పితృ కార్యాలలో కలిపి చేస్తారు.

9. ప్రతి అమావాస్య నాడు తప్పక పితృదేవతలను ఉద్దేశించి చనిపోయిన వారి పేరు మీదుగా తర్పణాలు, స్వయంపాకం వంటివి ఇచ్చి తీరాలని శాస్త్రము. ఎందుకు? అమావాస్యకు, పితృదేవతలకు ఉన్న సంబంధం ఏమిటి ?

◆ ప్రతి అమావాస్యకు, చనిపోయిన తమ పితరులు వారి ఇంటి గుమ్మం దగ్గర వచ్చి వారి పిల్లలు తర్పణాలు, పిండములు (వారికి జలము, ఆహారం) ఇస్తారేమో అని ఎదురు చూస్తారు. ఎంతో ఆకలితో ఎదురు చూస్తున్న వారికి మనం తర్పణాలు, పిండములు లేదా బ్రాహ్మణులకు స్వయంపాక దానము మొ|| ఇవ్వకపోతే, ఇలాంటి పుత్రులను కన్నందుకు బాధపడి, ఆ వంశాన్ని, వారి పిల్లల్ని శపించి వెళ్ళిపోతారు. అదే వారికి తగిన తర్పణం, దానం మొ|| ఇస్తే ఆకలి దాహం తీరిన వారు తృప్తితో వంశాన్ని ఆశీర్వదించి వెళ్లిపోతారు. వారి పిల్లలకు ఎటువంటి ఆపదలు రాకుండా రక్షిస్తారు. అందుకే చనిపోయిన వారి కోసం తర్పణాలు, దానాలు వంటివి చేసి తీరాలి.

10. దేహం విడిచిపెట్టిన వారిని ఉద్దేశించి, ఆ సంవత్సరం మొత్తం నెలకు ఒకసారి (మాసికము- చనిపోయిన తిథి నాడు) తర్పణాలు ఇవ్వడం, పిండప్రదానాలు చేయడం చేస్తారు. ఎందుకు? ముఖ్యంగా నెలలో చనిపోయిన తిథి నాడే ఎందుకు?

◆ భూలోక వాసులకు 24 గంటలు ఒకరోజు, పితృదేవతలకు 30 రోజులు ఒక రోజు, దేవతలకు 365 రోజులు ఒక రోజు. కాబట్టి నెలకు ఒకసారి పెడితే వారికి రోజూ ఆహారం అందించిన వారమవుతాము.

11. ఎప్పుడెప్పుడు శ్రాద్ధం లేదా తర్పణం చేయాలి?

◆ శ్లో|| అమాయుగ మనుక్రాంతి ధృతిపాద మహాలయాః | అష్టకా అన్వష్టకాచేతి షణ్ణవత్యః ప్రకీర్తితాః ||

ప్రతి సంవత్సరము పితృతర్పణములు 96 పర్వదినములలో ఇవ్వడం మంచిదని ధర్మశాస్త్రం. దానినే షణ్ణవతి శ్రాద్ధం లేదా తర్పణ పుణ్యకాలం అంటారు. అవి: 12 అమావాస్యలు, 12 సంక్రమణలు, 14 మన్వంతరములు, 4 ఉగాదులు (కృత, త్రేత, ద్వాపర, కలి యుగాదులు) - మాఘ అమావాస్య, భాద్రపద కృష్ణ త్రయోదశి, వైశాఖ శుక్ల తృతీయ, కార్తిక శుక్ల నవమి), వైధృతి యోగములు – 13, వ్యతీపాత యోగములు – 13,

మహాలయ పక్షములు – 16 (15 + 1), అష్టక & అన్వష్టక శ్రాద్ధములు (మార్గశీర్షం, పుష్యం, మాఘం, ఫాల్గునం - బహుళ(కృష్ణ) పక్షం సప్తమి, అష్టమి, నవమి) – 12, వంటి పర్వదినములలో (96) చేయడం వలన పితృదేవతల అనుగ్రహం విశేషంగా, సంపూర్ణంగా కలుగుతుంది.

◆ విషువత్ పుణ్యకాలంలో (పగలు, రాత్రి రెండూ సమానంగా ఉంటాయి. అవి సంవత్సరానికి రెండుసార్లు వస్తాయి) శ్రాద్ధం పెట్టడం కూడా ఉత్తమ ఫలితాలనిస్తుంది.

◆ ఆర్ద్ర, విశాఖ, స్వాతి, ధనిష్ఠ, పూర్వాభాద్ర, పుష్యమి, మఘ, పునర్వసు, శతభిషా నక్షత్రాలలోనూ, అమావాస్య ఉన్నప్పుడు శ్రాద్ధం పెడితే అక్షయఫలితం లభిస్తుంది. అలా ఆచరించినవారికి వేలకోట్ల సంవత్సరాలైనా కూడా ఆ పుణ్యం తరగదు.

◆ మాఘమాసం అమావాస్య, శతభిషం లేదా పూర్వాభాద్ర లేదా ధనిష్ఠా నక్షత్రాలతో కనుక కూడి ఉంటే అది పితృదేవతలకెంతో తృప్తిని కలిగించే ఇష్టమైన కాలం. ఆ సమయంలో శ్రాద్ధం పెట్టడమనే మహాభాగ్యం, ఎంతో పుణ్యం చేసుకొన్నవారికే లభిస్తుంది.

**12. శ్రాద్ధం ఎన్ని విధములుగా ఉంటుంది? శ్రాద్ధం కేవలముకు కేవలం మరణించిన తిథి మాత్రమే ముఖ్యమా?**

◆ శ్రాద్ధము ఈ క్రింది విధములుగా చేయవచ్చు.

**క్షణశ్రాద్ధం** - బ్రాహ్మణులను భక్తితో ఆహ్వానించి శాస్త్రోక్తంగా పిండప్రదానం చేసి భోజనం పెట్టే పద్ధతి

**కూర్చశ్రాద్ధం** - బ్రాహ్మణులు దొరకనప్పుడు వారికి ప్రతినిధిగా దర్భలను ఉంచి పితృకార్యం నిర్వహించడం

**ఆమశ్రాద్ధం (స్వయంపాకం)** - పితృతర్పణములు ఇచ్చి భోజనముకు సరిపడా కూరగాయాలు, వంటసామాన్లు ఇవ్వడం

**హేమ శ్రాద్ధం** - పైవన్నీ కుదరని పక్షంలో పితృతర్పణములు ఇచ్చి బంగారం (ధనం) దానం ఇవ్వడం.

**సంకల్ప తర్పణ** - కేవలం తర్పణం ఇచ్చి నమస్కరించడం

**గోగ్రాస ప్రదానం** - అదీ కుదరని పక్షం లో గోవులకు నమస్కరించి గోగ్రాసం అందిచడం. అదీ కుదరనప్పుడు ఆకాశం చూస్తూ నమస్కరించి నాకు ఏమీ చేయుటకు యోగ్యత లేదు అని, మన్నించమని భక్తితో నమస్కరిస్తూ చెప్పాలి. మృతతిథి మాత్రమే కాకుండా ఇంకా వివిధ రకాల శ్రాద్ధములు ఉన్నాయి. నిత్య, నైమిత్తిక, కామ్య, నాంది (వృద్ధి) శ్రాద్ధ, పార్వణ శ్రాద్ధములు కూడా ఉన్నవి.

**13. శ్రాద్ధముకు పెట్టిన పిండములు ఏమి చేయాలని శాస్త్రం?**

◆ పిండమును బాగా చేపలు ఎక్కువ ఉన్ననీటిలో విడవవచ్చు. కుదరని పక్షంలో భూమిలో పాతిపెట్టవచ్చు లేదా గోవుకు తినిపించవచ్చు. ఎంత గొప్పగా శ్రాద్ధం నిర్వహించినా గోవులకు గ్రాసం అందిచకపోతే సంపూర్ణం కాదని శాస్త్రం.

**14. పితృ కార్యాలు జరిగేటప్పుడు కర్త కాకుండా ఇతరులు ఏమి చెయవచ్చు?**

◆ వేద పారాయణ, పురాణ పారాయణ, భగవద్గీత, కఠ ఉపనిషత్, బ్రహ్మదత్తుని కథ (హరివంశం), పితృ స్తవం, శివకేశవ అష్టోత్తరం, వాసుదేవ శతనామాలు.

శ్లో॥ సప్తవ్యాధా దశార్ణేషు మృగాకాలంజరే గిరౌ |
చక్రవాకా శరద్వీపే హంసాః సరసి మానసే ||
తేఽభిజాతా కురుక్షేత్రే బ్రాహ్మణా వేదపారగాః ||
ప్రస్థితా దీర్ఘమధ్వానం యూయం కిం అవసీధత ||

శ్రాద్ధఫలితం సంపూర్ణంగా లభించాలంటే పై రెండు శ్లోకాలను తప్పకుండా పారాయణం చేసి తీరాలి.

**15. పితృదేవతలు (గణములు) ఎంతమంది?**

పితృదేవతలు - 7 గణములు - వీరి నామస్మరణ వలన సకల పాపాలు తొలగుతాయి. పితృదోషాలు తొలగుతాయి. వంశం వృద్ధి చెందుతుంది. శ్రాద్ధసమయంలో తప్పక వీరిని స్మరించాలని శాస్త్రం.

1. వైరాజుడు 2. అగ్నిష్వాత్తుడు 3. బర్హిషదుడు 4. సుకాలుడు 5. అంగిరసుడు 6. సుస్వధుడు 7. సోమపుడు

**16. పితృకార్యాలకు ఏ తిథి ఉంటే సత్ఫలితాలు వస్తాయి? ( శ్రీ మార్కండేయ పురాణం)**

◆ భాద్రపద మాసంలో కృష్ణపక్షంలో వచ్చే అమావాస్య, ప్రతి మాసం వచ్చే అమావాస్య నాడు, సూర్య గ్రహణం విడిచిన తర్వాత, పుట్టినరోజు నాడు, గ్రహాలు అనుకూలంగా లేనప్పుడు పితృకార్యాలకు అనుకూలమైనవి.

17. శ్రీ మహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రుడైన గరుత్మంతుడి కోరిక మేరకు వచ్చిన పురాణం " గరుడ పురాణం ". ఇందులో 19000 శ్లోకాలు రెండు కాండములుగా ఉంటాయి. మరణించిన వారి ఇంటిలో వైదికకార్యములో భాగములో గరుడ పురాణంలోని ఏ కాండమును తప్పక పారాయణం జరపాలి అని శాస్త్రము?

◆ ప్రేత కాండమును పారాయణము చేస్తే, వారికి సద్గతులు కలుగుతాయి అని శాస్త్రము

18. భూలోకంలో ఉన్న వారికి పగలు,రాత్రి కలిస్తే ఒక రోజు అంటారు, దేవతలకు ఉత్తరాయణం దక్షిణాయనం కలిపితే ఒక రోజు (అంటే ఒక సంవత్సరం). మరి పితృదేవతలకు ఒక రోజు అంటే?

◆ పితృ దేవతలకు శుక్ల పక్షము, కృష్ణ పక్షము కలిస్తే ఒక రోజు (30 రోజులు)

19. పూర్వం ఒక ప్రజాపతి పితృ దేవతలను ప్రసన్నం చేసుకోడానికి ఒక స్తోత్రంతో వారిని స్తుతించాడు. ప్రసున్నలైన పితృదేవతలు ఎవరైతే ఈ స్తోత్రం నిత్యం లేదా పర్వదినాలలో మరియు తప్పక శ్రాద్ధ సమయంలో పఠిస్తే వారి వంశమునకు పితృదోషాలు తొలగుతాయి అని వరం ఇచ్చారు. ఈ పితృదేవతా స్తుతిని రచించిన ప్రజాపతి ఎవరు?

◆ (మార్కండేయ పురాణము) రుచి

20. దేవ కార్యాలకు, పండుగలకు సూర్యోదయంలో ఉన్న తిథి ముఖ్యము అంటారు. మరి పితృ కార్యాలకు ఏ సమయమును పరిగణనలోకి తీసుకోవాలని శాస్త్రం?

◆ మధ్యాహ్నం 12 గంll ఉన్న తిథి ముఖ్యము

21. దర్భ అడుగున బ్రహ్మ, మధ్య నారాయణుడు, తుది యందు శివుడు ఉందురు. ఇంత పవిత్రత దర్భకు ఎందుకు వచ్చింది? దర్భ ఎలా ఉత్పన్నమైనది? s

◆ శ్రీమహావిష్ణువు రోమముల నుండి దర్భ ఉత్పన్నమైనది. అందుకే దర్భకు అంత పవిత్రత. దర్భ ఇంటిలో తప్పక ఉండి తీరాలి.

22. పితృకార్యాలు జరిగే ప్రదేశంలో నువ్వులను చల్లితే అక్కడికి దైత్యులు, దానవులు, అసురులు రారని శాస్త్రం. అంత పవిత్రత కలిగిన నువ్వులు ఎక్కడ నుండి ఉత్పన్నమైనవి?

◆ శ్రీ మహావిష్ణువు యొక్క స్వేద జలం నుండి నువ్వులు ఉత్పన్నమైనవి.

23. మరణం ఆసన్నమైన వారికి దుర్గతి కలగకుండా హరి సన్నిధానమునకు తీసుకెళ్లడానికి ముఖ్యంగా ఏవి తోడ్పడుతాయని శాస్త్రం?

◆ తులసి, హరినామ స్మరణం, గురుభక్తి , గంగాజలం

24. మరణం ఆసన్నమైనవారి ఎదుట ఏ దానం ఇస్తే వారికి స్వర్గపు వాకిలి తెరవబడును?

◆ గంగాజలంతో ఉన్న పాత్ర, గొడుగు, చెప్పుల జత, సాలగ్రామముతో కూడిన స్వయం పాకము.

25. శ్రవణులు ఎవరు?

◆ శ్రవణులు యమలోకవాసులు. యమలోకంలో శ్రవణులకి ప్రత్యేక స్థానం ఉంది. ఈ శ్రవణులు బ్రహ్మదేవుడి కుమారులు. స్వర్గ, మర్త్య, పాతాళ లోకాలలో సంచరిస్తూ ఉంటారు.

26. శ్రవణులు ఏమి చేస్తారు?

◆ కొన్ని లక్షల కిలోమీటర్ల దూరంలోని ధ్వనిని వినే శక్తి,చూడగలిగే దృష్టి వీరికి ఉంది. అందుకే వారిని శ్రవణులని పిలుస్తారు. వీరు గూఢచారులుగా పనిచేస్తూ చిత్రగుప్తునికి, యమునికి మనం చేసిన తప్పులు, పుణ్యకార్యములు తెలియచేస్తారు. అందుకే వారిని తలచుకోవడం కూడా పుణ్యప్రదం.

27. మరణించిన వారికి ప్రతి సంll శ్రాద్ధము తప్పక నిర్వహించాలి. ఆ శ్రాద్ధము పెట్టునప్పుడు ఎవరు ఉంటే ఆ శ్రాద్ధం ఎక్కువ ఫలితాన్ని ఇస్తుందని, పితృదేవతలు సంతోషిస్తారని శాస్త్రం?

◆ కూతురి కొడుకు

28. పితృ కార్యక్రమాలు జరిగే చోట ఏవి అస్సలు ఉండకూడదని శాస్త్రము?

◆ కోడి, పంది, కుక్క, రజస్వల, నపుంసకుడు, మైల ఉన్నవారు లేదా నాస్తికులు, శ్రాద్ధం పెట్టే సమయంలో రాకూడదు. ఒక వేళ వారు వస్తే పితృదేవతలు ఆగ్రహిస్తారు.

29. ఎన్ని దేవతా పూజలు చేసినా లేదా కోరికల కోసం దీక్షలు వహించినా లేదా దేవతా ప్రీత్యర్థం హోమము, అభిషేకాలు చేసినా కొందరి ఇంటిలో అశాంతి, పిల్లల వల్ల అభద్రత ఎందుకు వస్తుంటాయి?

◆ ఆ ఇంటిలో పితృ దేవతా ఆరాధన సరిగ్గా జరగక పోవడం వల్ల.

30. పితృదేవతలకు తద్దినం లేదా శ్రాద్ధము పెట్టడం వంటివి చేయడం ద్వారా వారు అనుగ్రహిస్తారు. ఎప్పుడైనా శ్రాద్ధం పెట్టే ఇంటిలో మైల రావడం లేదా ఇంటి గృహిణి ఇంటిలో రాకుండడం వంటి అనివార్య కారణము చేత చేయాల్సిన తిథిలో తద్దినం పెట్టకపోతే ఎప్పుడు పెట్టాలి?

◆ తరవాతి నెలలో వచ్చే అదే తిథి నాడు తప్పక పెట్టాలి లేదా ఆ నెల అమావాస్య నాడు.

31. పితృ కార్యాలలో వేటితో చేసిన పాత్రలను, పళ్ళాలను, వస్తువులను వాడినా లేదా దానం చేసినా మంచిదని శాస్త్రం?

◆ వెండితో చేసిన పాత్రలను వాడడం, దానం చేయడం మంచిది.

32. పితృకార్యాలను ఎంతో భక్తితో, శ్రద్ధతో చేస్తారు. ఈ కార్యక్రమం చేసేటప్పుడు కొన్ని పనులు అస్సలు చేయరాదు. అవి ఏమిటి?

◆ ఆ పూట కోపం అస్సలు పనికి రాదు. బ్రహ్మచర్యం పాటించాలి. కార్యక్రమం చేసే బ్రహ్మ గారిని విసుక్కోవడం లేదా త్వరగా ముగించమని చెప్పడం చేయరాదు.

33. మరణించిన వారి అస్థికలు, చితా భస్మము నదులలో మరియు ముఖ్యంగా కాశీలో కలపడం వల్ల వారికి స్వర్గం ప్రాప్తిస్తుందని ధర్మ శాస్త్రము. అయితే వాటిని ఎన్ని భాగాలుగా చేయాలి? ఎక్కడ కలపాలి?

◆ ముఖ్యంగా అస్థికలను 3 భాగాలుగా చేయాలి.

మొదటి భాగాన్ని 11 రోజులలో మనకు దగ్గర ఉన్న నదిలో కలపాలి. రెండవ భాగాన్ని కాశీ గంగలో కలపాలి. మూడవ భాగాన్ని ప్రయాగలో సంగమంలో కలపాలి. ఇలా చేస్తే మరణించిన వారికి గురు ఋణం, దేవ ఋణం, పితృ ఋణం తీరి వారికి స్వర్గం ప్రాప్తిస్తుందని శాస్త్రం.

34. శ్రాద్ధం ఎప్పుడెప్పుడు పెట్టచ్చు?

◆ శ్రాద్ధం అంటే కేవలం సం॥ కి ఒకసారి వచ్చే సంవత్సరికాలు మాత్రమే కాదు. ఈ క్రింది సందర్భాల్లో పితృ తర్పణాలు విడిచినా శ్రాద్ధంగా చెప్పబడుతుంది. గ్రహణం విడిచిన తర్వాత, ప్రతి నెలలో వచ్చు సంక్రమణ, వ్యతీపాత యోగం, జన్మ నక్షత్రము నాడు, మొదటి సారి ఏదైనా క్షేత్ర దర్శనం చేసుకొన్నప్పుడు, పీడ కలలు వచ్చినప్పుడు లేదా గ్రహాల అనుగ్రహం లేనప్పుడు మొ॥ సందర్భాల్లో చనిపోయిన తల్లిదండ్రులని తలచుకొని తర్పణాలు ఇవ్వడం కూడా శ్రాద్ధంగా చెప్పబడుతుంది.

35. పితృకార్యాలు చేసేటప్పుడు ముఖ్యంగా వేటిని స్వీకరించరాదు?

◆ మజ్జిగ, రాగి జావ

36. పితృ కార్యాలకు ముగ్గురు లేదా ఇద్దరు భోక్తలను ఆహ్వానించాలి. ఇద్దరు భోక్తలుగా ఉన్నప్పుడు ఏ దేవతలు భోక్తల స్థానములో కూర్చుని భోజనం చేస్తారు?

◆ భోక్తలుగా కనీసం ఇద్దరు ఉండాలి. 5 మందికి మించకూడదు. ఒకరు విశ్వే దేవతల స్థానంలో, ఇంకొకరు పితృదేవతల స్థానంలో కూర్చుని భోజనం చేస్తారు. భోక్తలను చాలా జాగ్రత్తగా గౌరవించాలి. వారిని విసుక్కోవడం వంటివి చేయరాదు.

37. సూర్యోదయానికి ముందే ప్రతి ఇంటి గడప ముందు రంగవల్లి (ముగ్గు) ఉంటే ఆ ఇంటికి లక్ష్మీ అనుగ్రహం ఉంటుందని మరియు ముగ్గు వేయడం ద్వారా దేవతలని ఇంటికి ఆహ్వానించినట్లు అని పెద్దల మాట. మరి కొన్ని ప్రత్యేక దినములలో ఇంటి ముందు ముగ్గు వేయకూడదు అంటారు. ఎప్పుడు?

◆ పితృదేవతలను ఆహ్వానించే రోజు అనగా శ్రాద్ధ కర్మలు నిర్వహించే రోజు మాత్రం ఇంటి ముందు ముగ్గు వేయరాదు. అమావాస్య లేదా నైమిత్తిక తిథులలో ఇచ్చే తర్పణములకు ఈ నియమం లేదు.

38. శ్రాద్ధముకు వండే వంట చాలా జాగ్రత్తగా మడితో చేయాలి. భోక్తలకు నివేదన కాకుండా మనం రుచి చూడడం, వండిన పదార్థాలలో వెంట్రుకలు వంటివి ఉండడం, భోక్తలు భోజనం చేస్తుండగా తుమ్మడం వంటివి చేయరాదు. ఎంత జాగ్రత్తగా చేసినా ఏదో ఒక దోషం లేకుండా చేయడం కష్టం. ఇలా తెలియనివి ఏవైనా దోషాలు తొలగాలంటే భోక్తలు భోజనం చేసే విస్తరిలో ఒక దళం ఉంచితే ఆ దోషాలు మనకు అంటవు. ఆ దళం ఏమిటి?

◆ తులసీ దళం

39. భోక్తలుగా ఎవరిని ఆహ్వానించాలి? ఎవరు వస్తే గొప్ప ఫలితం వస్తుంది? భోక్తలుగా వచ్చేవారికి గల నియమాలు ఏమిటి?

◆ ఒకే ఇంటి పేరు ఉన్న వాడిని భోక్తగా పిలువరాదు. సగోత్రికులని పిలువవచ్చు. ఒక్క యోగి లేదా పురాణజ్ఞుడు, పండితుడు భోక్తగా వస్తే అక్షయ ఫలితం వస్తుంది.

40. శుకునికి ఎవరితో వివాహం అయింది? ఆవిడ ఎవరు?

◆ పీవరి. పితృదేవతలలో బర్హిషదుని పుత్రిక

41. పితృదేవతలకు జరిపే క్రతువులలో దోషాలు ఉన్నా, ఎవరైనా బంధుమిత్రులలోని వారు అకాలమరణం పొందినా, పితరులకు ఉత్తమగతులు అందించాలన్నా ఒకే ఒక ఉత్తమ మార్గం ఏమిటి?

◆ భాగవత సప్తాహం జరిపించుట

42. పితృదేవతలను తరింపజేసే ముఖ్య క్షేత్రాలు ఏవి? (శ్రీ స్కాందపురాణం)

◆ పితృదేవతలను తరింపచేసే ముఖ్య ప్రదేశాలు కపిల తీర్థం, బదరిలో (అలకనంద) బ్రహ్మకపాలం, కాశీ గంగ, ప్రయాగ, గయా మొ||

43. సంవత్సరికం కాని వారికి మహాలయ పక్షాలలో పిండప్రదానం చేయవచ్చా?

◆ చేయరాదు. నియమబద్ధంగా మాసికములు మొదలైనవి పెట్టాలి. వారి కోసం పుణ్యకార్యాలు చేయవచ్చు.

44. శ్రాద్ధ భోజన నియమాలు ఏమిటి?

◆ శ్రాద్ధం రోజున రెండు కూరలు కలిపి చేయకూడదు (ఉదా: కంద, బచ్చలి కలపటం లాంటివి) శ్రాద్ధం పెట్టేటప్పుడు వండిన వంటలు రుచి చూడకూడదు. ఉప్పు భోజన సమయం లో వడ్డించరాదు. (ఉప్పు సరిపోయిందా లేదా అని మొదలగు వాటి కోసం) పితృదేవతలకి శ్రాద్ధంలో అప్పాలు చాలా ఇష్టం, కాబట్టి భోక్తలకి అప్పాలు చేసి వడ్డిస్తారు.

45. అన్నదమ్ములు కలిసి ఒకేచోట శ్రాద్ధం పెట్టాలా?

◆ ఒకే చోట పెట్టడం కుదరకపోతే ఎవరికి వారు విడిగా కూడా పెట్టచ్చు. కానీ ఒకరు చేస్తున్నారని మరొకరు మానకూడదు. పితృకార్యాలు చేయకపోవడం వల్ల వారి పిల్లలకు ఎదుగుదల ఉండదు.

46. పితృకార్యాలు చేయని వారు దేవతాపూజ, పండుగలు జరుపుకోవచ్చా?

◆ పితృకార్యాలు చేయని వారికి దేవతాపూజ చేసే అర్హత ఉండదు. చేసినా ఫలితం లభించదని శాస్త్రం. దేవతలు కూడా పితృదేవతలని పూజిస్తారు.

47. పిల్లలకు పితృకార్యాల గురించి అవగాహన ఎలా కలిపించాలి?

◆ పాత కాలంలో పితృకార్యాలు జరిగేటప్పుడు తప్పక తమ పిల్లలు ఉండేలా చూసేవారు. తద్వారా వారికి అవగాహన ఏర్పడుతుంది. భవిష్యత్ లో వారు కూడా తప్పక నిర్వహించి వంశాన్ని నిలబెడతారు.

48. శ్రాద్ధంలో భోక్తలకు వండే భోజనమే బంధువులు, స్నేహితులందరికీ పెట్టాలా?

◆ కేవలం ముఖ్య బంధువులు భోక్తలు భోజనం చేయగా మిగిలినది ప్రసాదంగా తీసుకుంటారు. ఉదాహరణకు ఊరిలో ఉన్న 500 మంది వస్తే ఇవే వంటలు చేయాల్సిన అవసరం లేదు. భూరి భోజనం ఏర్పాటు చేసి భోక్తలకు కాకుండా ఇతరులకు పెట్టవచ్చు.

49. మహాలయ పక్షాలు ఏ విధంగా చేయాలి? ఉన్న 15 తిథులలో ఎప్పుడు తర్పణాలు ఇవ్వాలి? ఎప్పుడు ప్రధాన శ్రాద్ధం పెట్టాలి? ఒకవేళ ఏదైనా మాసంలో పూర్ణిమ నాడు మరణిస్తే మహాలయ పక్షాలలో ఏ తిథినాడు శ్రాద్ధం నిర్వహించాలి?

◆ అవకాశం ఉన్నవారు ఆ 15 రోజులు తర్పణాలు విడవడం మంచిది. ఈ 15 తిథులలో వారి తల్లి లేదా తండ్రి మరణించిన తిథి నాడు తప్పక శ్రాద్ధం పెట్టడం చేయాలి. ఏ పక్షంలో చనిపోయినా, అంటే శుక్ల/కృష్ణ పక్షం అయినా తిథి ముఖ్యం. ఉదాహరణకు కర్త యొక్క తండ్రి మాఘ శుక్ల పంచమి నాడు స్వర్గస్తులైతే భాద్రపద కృష్ణ పక్ష పంచమి నాడు శ్రాద్ధం పెట్టాలి. భోక్తలను ముందు రోజే భక్తితో ఆహ్వానించాలి. ఒకవేళ ఏ మాసం లేదా ఏ తిథి లో మరణించారో తెలియకపోతే లేదా పూర్ణిమ నాడు మరణిస్తే మహాలయ అమావాస్య నాడు వారికి శ్రాద్ధం పెట్టాలి.

50. అగ్నిదేవునికి గల ఇద్దరు భార్యల పేర్లు ఏమిటి? ఏ కార్యాలకు వారి భార్యలు సహకరిస్తారు? అగ్నికి ఎన్ని తలలు ఉంటాయి?

◆ స్వాహా దేవి, స్వధా దేవి: అగ్ని దేవునకు రెండు తలలు ఉన్నాయి. హవ్యాన్ని దేవతలకు, కవ్యమును పితృదేవతలకు అందిస్తాడు. హోమంలో అందించే ద్రవ్యాన్ని హవ్యము (దేవకార్యాలకు) లేదా కవ్యము (పితృకార్యాలకు) అంటారు.

**51. పితృకార్యం చెయ్యవలసిన తిథి నాడు అశౌచం/అవాంతరం వస్తే (మైల, పురుడు వంటివి) ఏమి చెయ్యాలి?**

◆ ఈ క్రింది మూడు విధానాలలో ఏదో ఒక దానిని పాటించవచ్చు.

1. శుద్ధి రోజు చెయ్యవచ్చు ; 2. ఆ నెల అమావాస్య రోజు చేయవచ్చు ; 3. వచ్చే నెల అదే తిథినాడు చేయవచ్చు.

**52. స్వయంపాకం ద్వారా అక్షయఫలితం లభించాలంటే ఏమి చెయ్యాలి?**

◆ స్వయంపాకంలో తులసీదళాన్ని ఉంచినట్లైతే అక్షయఫలితం లభిస్తుంది.

**53. భోక్తలు మనింట్లో భోజనం చేయము అనే పక్షంలో ఏమి చేయాలి?**

◆ వారికి తప్పనిసరిగా ఇద్దరికి వండుకొని తినగలిగే ఆహార పదార్థములు ఇవ్వాలి. వాటినే స్వయంపాకం అంటారు. అందులో బియ్యం, పెసరపప్పు ఉండాలి. కందిపప్పు పనికిరాదు, ఆవునేతిని దానం చేస్తే పితృదేవతలు సంతోషిస్తారు..

**54. భోక్తలకు ఏ ఏ దానాలు చేస్తే ఏ ఏ ఫలితాలు పొందుతాము?**

◆ భోక్తలకి తద్దినం నాడు తాటాకు విసనకర్ర, వస్త్రములు, సువర్ణం శక్తి కొలది దానం చేయాలి. భోక్తలకు గోవుని దానం చేస్తే అటువంటి వాడు 3200 సంవత్సరములు స్వర్గ సౌఖ్యాలు అనుభవిస్తాడు. తాటాకు విసినకర్ర దానం ఇస్తే 1000 సంవత్సరాలు గంధర్వుల చేత గౌరవింపబడతారు. చెప్పులు, గొడుగు ఈ రెండూ శ్రాద్ధకాలంలో దానం చేస్తే అపుడు పితృదేవతలే కాదు కర్త కూడా (తదనంతరం) దివ్యవిమానంలో స్వర్గానికి వెళ్ళిపోతాడు.

**55. శ్రాద్ధ కార్యక్రమాల్లో తెలియక చేసిన దోషం తొలగాలంటే ఏమి చెయ్యాలి?**

◆ శ్రాద్ధ కార్యక్రమాల్లో దోషం చేస్తే 108 సార్లు కానీ 21 సార్లు గాని గాయత్రీ మంత్రం చేస్తే సకల దోషాల నుండి విముక్తి పొందుతారు.

**56. శ్రాద్ధ కార్యక్రమాల్లో ధరించకూడనివి ఏవి?**

◆ శ్రాద్ధం పెట్టేవారు బంగారమును ఎట్టి పరిస్థితులలోనూ ధరించరాదు. వారి ఇంటిలో స్త్రీలు కేవలం బంగారం మంగళసూత్రం తప్ప వేరే ఏ ఇతర బంగారు ఆభరణములు ధరించకూడదు.

**57. పితృకార్యాలు చేయడం అస్సలు కుదరనప్పుడు ఏమి చేయాలి?**

◆ కనీసం ఈ విషయాలు నెమరు వేసుకోవాలి (ఉదా || ఈ ప్రశ్నలు అన్నీ చదివిన వారికి, పితృదేవతల గురించి సమయం కేటాయించారని పితృదేవతలు అనుగ్రహిస్తారు)

**58. శ్రాద్ధసమయంలో బ్రహ్మదత్తుని కథ పారాయణం చేయడం వలన కలిగే శుభఫలితాలు ఏమిటి**

◆ శ్రాద్ధం వల్ల కీర్తి, యోగము ఐహిక సుఖములు కలుగుతాయి. బ్రహ్మదత్తుడు తన ఏడు జన్మలకు ముందు తన పితరులకు పెట్టిన శ్రాద్ధం వల్ల పొందిన గొప్ప ఫలితం తెలియజేసే కథ. పూర్వం భరద్వాజుని పుత్రులు యోగులయ్యారు. కానీ కొన్ని రోజుల తర్వాత చెడు పనులు, దుష్టసహవాసం వల్ల యోగభ్రష్టులయ్యారు. కొన్ని జన్మల తర్వాత కౌశిక వంశంలో విశ్వామిత్రునికి 7 మంది పుత్రులుగా జన్మించారు. వారు వాగ్దుష్టుడు, క్రోధనుడు, హింస్రుదుడు, పిషూణుడు, కలి, కస్సృమ, పితృవర్తి. తండ్రి చనిపోయాక గర్గముని ఆశ్రమంలో శిష్యులుగా చేరారు. ఒకనాడు గురువుగారు ఆజ్ఞ ఇవ్వగా ఆవులను మేపటానికి అడవికి తీసుకెళ్ళారు. దారితప్పి తిండి, తిప్పలు లేక నాలుగు రోజులపాటు పస్తులున్నారు. తీవ్రమైన ఆకలిబాధను తట్టుకోలేక వారికి చెడుబుద్ధి ప్రాప్తించి వారు మంచో, చెడో తెలియక ఆవును చంపి తిందాము అని అనుకుంటారు. అందులో పితృవర్తి ఇలా గోహత్య చేయడం తప్పు. కానీ పితృశ్రాద్ధం చేసి గోవును సమర్పించి ఆహారం స్వీకరిద్దాము అంటాడు. అందుకు అందరూ అంగీకరిస్తారు. తరువాత గురువైన గర్గుని దగ్గర ఆవును పులి తినేసిందని అబద్ధం చెపుతారు. కొద్దికాలం గడిచాక వారు మరణిస్తారు.

గోహత్య కారణంగా వారు మరుజన్మలో కిరాతనునికి దశార్ణదేశంలో ఏడుగురు పుత్రులుగా పుట్టారు. వారి పేర్లు: నిర్వైరుడు, నిర్వృత్తి, శాంత, నిర్మన్యు , కృతి, వైద్యసోమ, నృవర్తి. ఏడుమందికి పూర్వజన్మలో శ్రాద్ధం పెట్టిన పుణ్యఫలం చేత వారికి పూర్వజన్మ స్మృతి ఉన్నది. ఏ మాత్రం హింస చేయకుండా ఉండేవారు. తల్లిదండ్రుల సేవ చేసేవారు. ధర్మాత్ములు అయ్యారు. యోగాభ్యాసంతో ప్రాణాలు విడిచారు. తరువాతి జన్మలో కాలంజర అనే పర్వతం దగ్గర ఏడుగురు జింకలుగా పుట్టారు. వారి పేర్లు ఉన్ముఖ, నిత్యవిత్రస్త, దబ్ధకరణి , విలోచన, పండిత, భస్మర, నాది. వీరు ఈ

జన్మలో కూడా యోగ ఉపాసన చేసి ఆయుష్షు తీరాక జింకల రూపంలో మరణించారు. తరువాతి జన్మలో శరద్వీపంలో ఏడుగురు చక్రవాక పక్షులుగా జన్మించారు. వారి పేర్లు నిస్పృహ, నిర్మమ, క్షాంత, నిర్ద్వంధ, నిష్పరిగ్రహ, నిర్వృతి, నిభృత. ఆహారనియమాలు పాటించి యోగాభ్యాసం చేసి శరీరాన్ని విడిచిపెట్టారు. తరువాతి జన్మలో ఏడుగురు హంసలుగా జన్మించారు. వారు సుమన, సుచివాక్, శుద్ధ, పంచమ, చిత్రదర్శి, సునేత్ర, స్వతంత్ర. అవన్నీ మానససరోవరం దగ్గర తపస్సు చేసుకొంటుండగా, ఆ సరోవరానికి వచ్చిన అక్కడి రాజు, మంత్రుల భోగాలు చూసి ఈ మాయచేత ఒకరు రాజుగా ఇద్దరు మంత్రులుగా పుట్టారు. అతడే బ్రహ్మదత్తుడు, సకల విద్యలను నేర్చుకొన్నాడు. దేవలముని పుత్రిక సన్నతిని వివాహం చేసుకొన్నాడు. ఒకసారి అంతఃపురంలో ఉండగా ఒక మగచీమ, ఆడచీమతో మాట్లాడుతున్న సంభాషణ చూసి బ్రహ్మదత్తుడు నవ్వాడు. ఆ విద్య గురించి ఎవ్వరికీ చెప్పరాదన్న కారణం చేత సన్నతికి చెప్పలేదు. అయినా సన్నతి నీకు మరణం వచ్చినా పర్లేదు వాటి సంభాషణ చెప్పాల్సిందే అని పట్టుపట్టింది. అది చూసి బ్రహ్మదత్తునికి వైరాగ్యం వచ్చి అడవికి మంత్రులతో సహితంగా వెళతాడు.

హంసలుగా ఉన్న మిగిలిన నాలుగు యోగాభ్యాసంతో ఆ దేహత్యాగం చేసి కురుక్షేత్రంలో ఒక పేద బ్రాహ్మణునికి పుత్రులుగా పుట్టి పూర్తి వైరాగ్యంతో ఉంటారు. వారు యోగాభ్యాసం చేయదలచి ఇల్లు విడుస్తుండగా వారి తండ్రి, పోషణనిమిత్తం రాజు దగ్గరకు పంపుతూ ఈ రెండు శ్లోకాలు రాజుమంత్రుల ఎదుట చదవమని చెప్తాడు. తపస్సు చేయడానికి వెళ్ళిన బ్రహ్మదత్తుడు విష్ణుదర్శనం చేసుకొని మంత్రులతో సహా రాజ్యానికి విచ్చేస్తారు. అప్పుడు ఆ బ్రాహ్మణుడు ఈ క్రింది శ్లోకాలు చెప్పాడు.

శ్లో॥ 1. సప్తవ్యాధా దశార్ణేషు మృగాకాలంజరే గిరౌ | చక్రవాకా శరద్వీపే హంసాః సరసి మానసే ||

2. తేఽభిజాతా కురుక్షేత్రే బ్రాహ్మణా వేదపారగాః | ప్రస్థితా దీర్ఘమధ్వానం యూయం కిం అవసీథత ||

శ్రాద్ధఫలితం సంపూర్ణంగా లభించాలంటే పై రెండు శ్లోకాలను తప్పకుండా పారాయణం చేసి తీరాలి. "ఓ మహారాజా! దశార్ణదేశంలో ఏడుగురు కిరాతులు, కాలంజన పర్వతమందు ఏడుగురు మృగాలు, శరద్వీపంలో ఏడుగురు పక్షులు, మానససరోవరం లో ఏడుగురు హంసలై పుట్టాయి. వాటి నుండి మేము నలుగురం కురుక్షేత్రంలో ఒక వేద పండితునికి పుట్టి చాలా దూరం వెళ్ళి మిమ్మల్ని వెతికాము. చాలా కష్టపడి చూచాము". అని చదవగానే వారికి పూర్వజన్మ వృత్తాంతం గుర్తుకు వచ్చి రాజు, మంత్రులు మూర్ఛపోతారు. తరువాత బ్రాహ్మణులకి తగిన ధనం, సన్మానం చేసి పంపిస్తారు. రాజు అంతఃపురం వెళ్ళి తన భార్య సన్నతి దగ్గర నీవే నన్ను తిరస్కరించకపోతే నేను విష్ణుదర్శనం చేసుకోలేకపోయేవాడిని అంటాడు. అప్పుడు సన్నతి, ఓ రాజా మీరు లౌకిక విషయాలు, సుఖభోగాలకు అలవాటుపడి ఆ పరమాత్మను మరచిపోతున్నారు. అందుకే ఆ విధంగా కఠినంగా అన్నాను. ఆ శ్లోకాలు, చీమలభాష కూడా నాకు తెలుసు అంటుంది. ఆశ్చర్యపడిన బ్రహ్మదత్తుడు నీవు ఎవరు అని ప్రశ్నిస్తాడు. రాజా మీరు ఏడుగురు గర్గ శిష్యులుగా ఉన్నప్పుడు చంపిన గోవును నేను అంటుంది. అందుకే గోవు అజాతశత్రువు. గోవును హింసించినా, అది వారిని క్షమిస్తుంది. మిమ్మల్ని తరింపచేయడానికి మీ భార్యగా అయ్యానని సన్నతి చెపుతుంది. తరువాత ఆ ఏడుగురు యోగాభ్యాసం చేసి శరీరం విడిచిపెట్టారు. గోహత్య, గోహింసకు పరిహారం లేదు. అయినా భక్తితో శ్రాద్ధం పెట్టిన పుణ్యంచేత అటువంటి వారు సద్గతులు పొందగలిగారు. ఈ కథను విన్నా, పారాయణం చేసినా పశుపక్ష్యాది జన్మలు పొందరు. అంత్యకాలంలో యోగాభ్యాసం చేసి తరిస్తారు. పితృదేవతల అనుగ్రహము సంపూర్ణంగా ఉంటుంది.

**59. పితృదేవతా కార్యక్రమాలు విడిచిపెడితే ఏమవుతుంది?**

◆ పండుగలు జరుపుకుంటే దేవతలు ఆ కుటుంబానికి ఆశీర్వాదం అందచేస్తారు. కుదరని పక్షంలో పండుగలు చేయకపోయినా పెద్దదోషం కలుగదు. కానీ శ్రాద్ధ దినములు, పితృపక్షంలో తగిన విధంగా పితృదేవతలను సంతృప్తిపరచకపోతే అటువంటి వారికి తప్పక అశుభఫలితాలు కలుగతాయని శాస్త్రం.

**60. పితృదేవతలను ఏమని కోరుకోవాలి?**

◆ మా వంశం వృద్ధి చెందుగాక. మా వంశంలో దాతలు, వేదం చదువుకున్నవారు పెరుగు గాక, నీచులు పుట్టకుండా ఉండుగాక, మేము శ్రద్ధతో మంచి కార్యక్రమములు చేయుదుము గాక అని కోరుకోవాలి.

సర్వం శ్రీ గురుచరణారవిందార్పణమస్తు బలం గురోః ప్రవర్ధతాం సమస్త లోకాః సుఖినో భవంతు